తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మెట్రో ఫేజ్-2కు వెంటనే అనుమతులు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఇప్పటి వరకు టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ఖరారు చేయకపోవడంతో పాటు ఎస్‌బీఐ క్యాప్స్‌కు అధికారిక బాధ్యతలు అప్పగించడంలో జాప్యం జరుగుతోందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఆలస్యం వల్ల మెట్రో ఫేజ్ 1 నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ఫేజ్ 2 డీపీఆర్‌ల ఆమోదం, నిధుల సమీకరణ ప్రక్రియ కూడా ఆలస్యమవుతోందని పేర్కొన్నారు.

జాప్యం కొనసాగితే ప్రాజెక్టు వ్యయం మరింత పెరిగే అవకాశం ఉందని సీఎం హెచ్చరించారు. హైదరాబాద్ భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు మెట్రో ఫేజ్ 2 అత్యంత కీలకమని, అందువల్ల ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరు కేంద్ర మంత్రులు వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని ఎస్‌బీఐ క్యాప్స్ నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని ముఖ్యమంత్రి కోరారు. తద్వారా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలు వేగంగా అమలై, మెట్రో ఫేజ్ 1 స్వాధీనం ప్రక్రియ పూర్తికావడంతో పాటు ఫేజ్ 2 విస్తరణ పనులు కూడా వేగంగా ముందుకు సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.



# అనుమతి లేని కళాశాలల్లో చేరి మోసపోవద్దు

హైదరాబాద్, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

అనుమతి లేని డిగ్రీ కళాశాలల్లో చేరి మోసపోవద్దని వీసీ సజ్జనార్ ఐపీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం అనుబంధ గుర్తింపు లేకపోయినా ఉన్నట్లు తప్పుడు ప్రచారం చేస్తూ విద్యార్థులను మోసం చేస్తున్న విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు ఇచ్చిన సమాచారంతో హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని పలు కళాశాలలపై విచారణ చేపట్టగా, కొన్ని విద్యాసంస్థలకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి అనుబంధ గుర్తింపు లేదని తేలినట్లు తెలిపారు. అయినప్పటికీ ఓయూ అఫిలియేషన్ ఉందంటూ తప్పుడు ప్రకటనలతో విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నట్లు



గుర్తించామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు ప్రచారాలతో ప్రవేశాలు నిర్వహిస్తున్న కళాశాలలపై హైదరాబాద్ నగర పోలీసులు చట్టపరమైన చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే ఇటువంటి యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'దోస్త్' ప్రవేశ ప్రక్రియలో నమోదైన, గుర్తింపు పొందిన కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు పొందాలని సజ్జనార్ సూచించారు. ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి తమ విద్యా సంవత్సరం, కష్టార్జిత ధనాన్ని వృథా చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు చేస్తున్న కళాశాలల సమాచారం తెలిసినా వెంటనే డయల్-100కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. విద్యా ప్రవేశాల విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించి మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# హైదరాబాద్‌లో లక్ష ఇందిరమ్మ ఇళ్లే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించారని, దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహాలు అందేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. పేదల జీవనోపాధికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా గృహ నిర్మాణ విధానాన్ని రూపొందించామని చెప్పారు.

ప్రభుత్వం గృహాలకే పరిమితం కాకుండా పేదల సంక్షేమాన్ని సమగ్రంగా అమలు చేస్తోందని పొన్నం ప్రభాకర్ తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేస్తున్నామని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి 48 గంటల్లోనే కార్డులు జారీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. రేషన్ కార్డులతో పాటు నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ, అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, స్వయం ఉపాధి అవకాశాలు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ శాఖల్లో ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.

హైదరాబాద్ నగరంలోని పాత ప్రభుత్వ గృహ సముదాయాలు, వాంబే హౌసింగ్, జేఎన్ఎన్‌యూఆర్ఎం తదితర పథకాల కింద నిర్మించిన భవనాలపై సమగ్ర సర్వే నిర్వహించాలని మంత్రి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నివాసయోగ్యం కాని భవనాలను వెంటనే ఖాళీ చేయించి, మరమ్మతులు చేయదగిన భవనాలను పునరుద్ధరించాలని, పూర్తిగా శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చివేసి కొత్తగా నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. భవనాలను మూడు విభాగాలుగా వర్గీకరించి సమగ్ర నివేదికను ప్రభుత్వం ముందుంచాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ మాట్లాడుతూ, ప్రతి పేద కుటుంబానికి శాశ్వత గృహం కల్పించడం సామాజిక న్యాయానికి ప్రతీక అని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మాట్లాడుతూ మొత్తం 361 గృహాలను లబ్ధిదారులకు కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడ మండలానికి చెందిన వారికి 187, నాంపల్లి నియోజకవర్గంలోని ఆసిఫ్‌నగర్ మండలానికి చెందిన వారికి 79, నాచారం కాలనీ ప్రాంతానికి చెందిన వారికి 95 గృహాలు కేటాయించినట్లు వివరించారు. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్ ఒవైసీ, మాజిద్ హుస్సేన్ లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న గృహ నిర్మాణ కార్యక్రమాలు రాష్ట్రంలో సామాజిక భద్రతను మరింత బలోపేతం చేస్తాయని వారు అభిప్రాయపడ్డారు.

# కాళేశ్వరం బ్యారేజీలకు శాస్త్రీయ పునరుద్ధరణ తప్పనిసరి: ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణ భద్రతపై తీవ్రమైన అనుమానాలు ఉన్నాయని అన్నారు. మూడు బ్యారేజీల పునాదులు బలహీనంగా ఉన్నాయని, నిర్మాణపరమైన లోపాలపై నిపుణుల పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. అన్ని సాంకేతిక సమస్యలను పూర్తిగా పరిష్కరించిన తర్వాతే వాటి నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం ఇంజినీరింగ్ భద్రతా ప్రమాణాలను పక్కన పెట్టిందని ఉత్తమ్ ఆరోపించారు. ప్రజాధనం, ప్రజల భద్రతతో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం పునరుద్ధరణ పనులు పూర్తి చేసిన తర్వాత మాత్రమే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ప్రాజెక్టుల స్థిరత్వం, ప్రజాధన పరిరక్షణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. నిపుణుల సూచనలు, సాంకేతిక నివేదికల ఆధారంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణలో నాణ్యతకు ఎలాంటి రాజీ ఉండదని ఉత్తమ్ స్పష్టం




చేశారు. ప్రతి దశలో సాంకేతిక ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ పనులను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంతో చేపట్టిందని మంత్రి వెల్లడించారు.

# దొంగ పెన్షన్లకు చెక్.. లక్ష మంది అనర్హుల తొలగింపు

(మొదటి పేజీ తరువాయి)

అర్హులకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ప్రత్యేక తనిఖీల్లో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, కొన్నేళ్ల క్రితమే మరణించిన లబ్ధిదారుల పేర్లు కూడా జాబితాల్లో కొనసాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. మరణించిన వారి పేర్లను తొలగించకుండా కొందరు అక్రమంగా ప్రతి నెలా పెన్షన్ నగదును పొందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో బయటపడింది. ఈ వ్యవహారం ప్రభుత్వానికి భారీ ఆర్థిక నష్టాన్ని కలిగిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

ఈ అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు తప్పనిసరిగా 'లైఫ్ అథెంటికేషన్' ప్రక్రియ అమలు చేయడంతో జీవించి ఉన్న లబ్ధిదారులు, మరణించిన వారి వివరాలు, ఇతర అనర్హుల సమాచారం స్పష్టంగా గుర్తించే అవకాశం లభించింది. ఈ డిజిటల్



ధ్రువీకరణతో దొంగ పెన్షన్ల వ్యవహారం బయటపడగా, వెంటనే చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. గుర్తించిన లక్ష మంది అనర్హుల పేర్లను శాశ్వతంగా జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఈ చర్యతో ప్రతి నెలా ప్రభుత్వ ఖజానా నుంచి వృథాగా వెళ్తున్న కోట్ల రూపాయల ప్రజాధనం ఆదా కానుందని అధికారులు భావిస్తున్నారు. సామాజిక భద్రతా పథకాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగేలా పారదర్శక వ్యవస్థను అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటున్నారు.

అనర్హుల తొలగింపుతో మిగిలే నిధులను నిజమైన లబ్ధిదారులకు మళ్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రెండు లక్షల మంది కొత్త అర్హులకు పెన్షన్లు మంజూరు చేసే ప్రక్రియ కొనసాగుతుండగా, తాజాగా తొలగించిన అనర్హుల స్థానంలో మరో లక్ష మంది అర్హులను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. దీంతో మొత్తం మూడు లక్షల మంది కొత్త లబ్ధిదారులకు సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకు అవసరమైన నిధుల సమీకరణ, బడ్జెట్ కేటాయింపులపై ఆర్థిక శాఖ కసరత్తు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ చర్యలతో వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, ఎయిడ్స్ బాధితులు తదితర అర్హుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. గ్రామ, వార్డు స్థాయిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుండగా, తుది జాబితాను త్వరలో విడుదల చేసి కొత్త పెన్షన్ల పంపిణీ ప్రారంభించే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజమైన అర్హులకు చేరేలా ప్రభుత్వం చేపట్టిన ప్రక్షాళన కీలక ముందడుగుగా మారనుంది.

# కాళేశ్వరం పంపులు వెంటనే ప్రారంభించాలి: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సమస్యలను తెలుసుకునేందుకు ప్రధాన ప్రతిపక్షంగా కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వస్తే పోలీసులు అడ్డుకోవడం దురదృష్టకరమని కేటీఆర్ అన్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించేందుకు వస్తున్న తమపై పోలీసు నిర్బంధం ఎందుకు విధిస్తున్నారని ప్రశ్నించారు. రైతుల కోసం వస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎందుకు భయమని నిలదీశారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో చెబుతున్న కారణాలను కేటీఆర్ తప్పుబట్టారు. రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెంటనే పంపులను ప్రారంభించి నీటిని ఎత్తిపోసి జలాశయాలను నింపాలని డిమాండ్ చేశారు. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతున్న అంశంపై అధికారులను ప్రశ్నించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి పంప్‌హౌస్‌లను ప్రారంభించకపోతే 50 వేల నుంచి 60 వేల మంది రైతులతో కలిసి కన్నేపల్లి పం



ప్‌హౌస్‌ను ముట్టడించి తామే పంపులను ప్రారంభిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. రైతు ప్రయోజనాల కంటే మరేదీ ప్రభుత్వానికి ముఖ్యమై ఉండకూడదని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను ప్రభుత్వం గుర్తించాలని కేటీఆర్ సూచించారు. రాజకీయాలకు అతీతంగా రైతుల ప్రయోజనాల కోసం వెంటనే కాళేశ్వరం పంప్‌హౌస్‌లను ప్రారంభించి సాగునీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు.

# ఎన్నికల బరిలోకి ప్రశాంత్ కిశోర్

- బంకిపూర్ ఉపఎన్నికలో పోటీ
- ప్రత్యక్ష రాజకీయాలకు శ్రీకారం
- బీజేపీ కంచుకోటలో ఆసక్తికర పోరు

పాట్నా, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

ఎన్నికల వ్యూహకర్తగా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టనున్నారు. బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో ఆయన పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు జన్ సురాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మనోజ్ భారతి అధికారికంగా ప్రకటించారు. దీంతో ప్రశాంత్ కిశోర్ రాజకీయ అరంగేట్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. బంకిపూర్ అసెంబ్లీ స్థానం బీజేపీకి దశాబ్దాలుగా కంచుకోటగా కొనసాగుతోంది. ఈ స్థానం నుంచి గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయగా ఉపఎన్నిక అనివార్యమైంది.



జులై 30న పోలింగ్, ఆగస్టు 3న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ సందర్భంగా ప్రశాంత్ కిశోర్ మాట్లాడుతూ బంకిపూర్ ఉపఎన్నికను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నామని తెలిపారు. బీహార్‌లో ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఈ ఎన్నిక కీలకమని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా జన్ సురాజ్ ఉద్యమమే తన జీవిత లక్ష్యంగా మారిందని, బీహార్‌లో మార్పు తీసుకురావాలన్న సంకల్పంతోనే ఎన్నికల బరిలోకి దిగుతున్నానని చెప్పారు.

తనపై విశ్వాసం ఉంచిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రశాంత్ కిశోర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో బంకిపూర్‌లో విజయం సాధించి రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడతామని ధీమా వ్యక్తం చేశారు.

ఈ ఉపఎన్నికలో ప్రశాంత్ కిశోర్‌కు మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు బీజేపీ కంచుకోటగా ఉన్న బంకిపూర్‌లో జన్ సురాజ్ అభ్యర్థిత్వం ఎన్నికల పోరును మరింత ఆసక్తికరంగా మార్చింది. ఇతర ప్రతిపక్ష పార్టీల వైఖరిపై కూడా రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి.. అధికారుల నిర్లక్ష్యానికి మరో నిండు ప్రాణం బలి

- **నాగేంద్ర యాదవ్, జిల్లా గొర్రెల సంఘం మాజీ డైరెక్టర్**



**పెద్దమందడి,జులై06(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలంలోని ముందరి తండా నుంచి చిన్న మందడి గ్రామానికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్న మందడి గ్రామానికి చెందిన జనిగే కురుమూర్తి (36) మృతి చెందడం అత్యంత విషాదకరమని జిల్లా గొర్రెల సంఘం మాజీ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు నాగేంద్ర యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు ముందరి తండా-చిన్న మందడి రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారిందని, అయినప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటి వరకు మరమ్మత్తు పనులు చేపట్టకపోవడంతో ప్రజలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఆయన అన్నారు.ఈ రహదారి దుస్థితిపై పలుమార్లు వార్తా పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించలేదని నాగేంద్ర యాదవ్ విమర్శించారు.అధికారుల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగానే అధ్వాన్నంగా మారిన రహదారిపై బైక్ అదుపుతప్పి కురుమూర్తి ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముందరి తండా-చిన్న మందడి రహదారికి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టి ప్రజలకు సురక్షిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని నాగేంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. ఇకపై ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా రహదారుల మరమ్మత్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

## ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి




- **కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు**

**వనపర్తి,జులై 05 (తెలంగాణ ముచ్చట్లు):** ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వనపర్తి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గోటు విలేజెస్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం వనపర్తి పట్టణంలోని కర్రెమ్మ గుడి వద్ద మాదిగ కుల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జెండా గద్దె నిర్మాణానికి స్థల సేకరణపై చర్చించారు.ఈ సందర్భంగా ఎంఈఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు గద్వాల కృష్ణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ మాట్లాడుతూ, మాదిగల వర్గీకరణ అవసరాన్ని వివరించారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మూడు దశాబ్దాలపాటు సాగిన ఉద్యమ ఫలితంగానే వర్గీకరణ చట్టం సాధ్యమైందని పేర్కొన్నారు. వర్గీకరణ ద్వారా లభించే అవకాశాలను మాదిగ విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య, ఉద్యోగాల్లో రాణించాలని సూచించారు.జులై 7న జరిగే ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించాలని, నూతన జెండా గద్దెలను నిర్మించి ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సమావేశాన్ని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త గంధం గట్టయ్య మాదిగ నిర్వహించారు.కార్యక్రమంలో వీఎచ్‌పీఎస్ నాయకులు గంధం లక్ష్మయ్య, సుబ్రహ్మణ్యం, గంధం ఎల్లయ్య మాదిగ, ఆకులోర అంజి మాదిగ, ద్వారపోగు మద్దిలేటి మాదిగ పాల్గొన్నారు.

## నరాల ఎల్లమ్మ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి



**పెద్దమందడి,జూలై05(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యుడు నరాల నాగభూషణ్ నాగన్న తల్లి నరాల ఎల్లమ్మ శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెల్టూర్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎల్లమ్మ నివాసానికి వెళ్లి ఆమె భౌతికకాయానికి నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే నరాల నాగభూషణ్ నాగన్నతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చి,ఎల్లమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డే శేఖర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, బిజెపి మాజీ మండలాధ్యక్షుడు రమేష్, మద్దూర్ వెంకటయ్య, గుండెలో ఆంజనేయులు, ఇర్కిచెట్టి నారాయణ, మహేంద్ర, కర్నె నాగన్న, కుమ్మరి కొండన్న, కావాలి రాజు, బండి ప్రవీణ్, నాయకులు, కార్యకర్తలు, పాల్గొని ఎల్లమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారూ.

# తల్లి జన్మనిస్తే.. మొక్కలు పునర్జన్మ ఇస్తాయి

- **వనమహోత్సవంలో చైర్మన్ సందేశం**

**జమ్మికుంట టౌన్ జులై 05 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కౌన్సిలర్, ప్రతి పౌరుడు, ప్రతి మహిళ తమ నివాసాల వద్ద తప్పనిసరిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు.
"తల్లి జన్మనిస్తే.. మొక్కలు పునర్జన్మ ఇస్తాయి" అని పేర్కొంటూ, పెరుగుతున్న జనాభాతో ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని తగ్గించాలంటే విస్తృతంగా మొక్కలు నాటడం అవసరమని అన్నారు. ఖాళీ ప్రదేశాలతో పాటు ప్రతి ఇంటి పరిసరాల్లోనూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేష్, చందా రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇల్లందుల రమేష్, బొళ్ల సదానందం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీకాంత్, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, సీఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు తదితరులు పాల్గొన్నారు.




# ఆదర్శ ఉపాధ్యాయుడు నాగేశ్వరరెడ్డికి ఘన సన్మానం

**వనపర్తి, జులై 05 (తెలంగాణ ముచ్చట్లు):** జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా 36 సంవత్సరాల పాటు సేవలందించి ఇటీవల పదవీ విరమణ పొందిన ఆదర్శ ఉపాధ్యాయుడు నరహరి నాగేశ్వరరెడ్డిని సాహితీ కళా వేదిక ప్రతినిధులు ఆదివారం నంద్యాలలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. నాగేశ్వరరెడ్డి ఉపాధ్యాయ వృత్తికి అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పలు పాఠశాలల్లో తన సొంత నిధులతో మౌలిక వసతులు కల్పించడం ఆయన సేవాభావానికి నిదర్శనమన్నారు.వనపర్తి జిల్లాతో నాగేశ్వరరెడ్డికి ప్రత్యేక అనుబంధం ఉందని, జిల్లాలోని పలువురు రచయితలు, సాహితీవేత్తలకు ఆయన ఆర్థికంగా అండగా నిలిచారని శంకర్ గౌడ్ పేర్కొన్నారు.అనంతరం సాహితీ కళా వేదిక సభ్యులు నాగేశ్వరరెడ్డిని శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బైరోజు చంద్రశేఖర్, డా. బి. శ్యాంసుందర్, బి. రాజశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల పరిశీలనతో,గృహప్రవేశలతో బిజీగా మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని






**హుజూరాబాద్,జులై 05(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు, గృహప్రవేశ వేడుకలు, శుభకార్యాల్లో పాల్గొని బిజీగా గడిపారు. ముందుగా పట్టణంలోని 5వ వార్డులో లబ్ధిదారుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు తిరుపతి, వార్డు కౌన్సిలర్ సునీత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం 5వ వార్డులోని బతుకమ్మ సౌళ్ల సమీపంలో పేరుకుపోయిన మురుగు నీటి సమస్యను పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థను స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాల మెరుగుదలకు మున్సిపాలిటీ ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. తదుపరి 19వ వార్డులో బండారి జీవన్ జ్యోతి-కృష్ణ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ రాజ్‌కుమార్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారి పరిసర ప్రాంతాల్లో జరిగిన పలు శుభకార్యాల్లో పాల్గొని ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరవేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

# నెలలుగా మూతపడిన ఆర్టీసీ కార్గో కేంద్రం

- **ప్రభుత్వంపై మిట్టపల్లి సురేందర్ ఆగ్రహం**



**హుజూరాబాద్, జూలై 5 (తెలంగాణ ముచ్చట్లు):** నియోజకవర్గ కేంద్రంగా, వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై కీలక పట్టణంగా ఉన్న హుజూరాబాద్‌లో తెలంగాణ ఆర్టీసీ కార్గో సేవలు గత కొన్ని నెలలుగా నిలిచిపోవడంపై కరీంనగర్ జిల్లా సమాచార హక్కు చట్టం అధ్యక్షులు మిట్టపల్లి సురేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, నెలలు గడుస్తున్నా మూతపడిన ఆర్టీసీ కార్గో కేంద్రాన్ని పునరుద్ధరించేందుకు సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. హుజూరాబాద్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు పార్సిళ్లు, వస్తువుల రవాణా కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన కార్గో సేవలు నిలిచిపోవడంతో వ్యాపార కార్యకలాపాలు ప్రభావితమవుతున్నాయని, ప్రజల సమస్యలను అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో ఇలాంటి పరిస్థితి కొనసాగడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. హుజూరాబాద్ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని తెలంగాణ ఆర్టీసీ కార్గో సేవలను తక్షణమే పునరుద్ధరించాలని మిట్టపల్లి సురేందర్ డిమాండ్ చేశారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం కఠిన చర్యలు

- **అక్రమాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు**

**హుజూరాబాద్,జులై 05(తెలంగాణ ముచ్చట్లు ):** తెలంగాణలో ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పంపిణీ చేసే రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. పేదల కోసం ఉద్దేశించిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, తరలించడం, విక్రయించడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించాలని సూచించింది. పౌర సరఫరాల శాఖతో పాటు పోలీసు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు సమన్వయంతో దాడులు నిర్వహించి నిందితులపై కేసులు నమోదు చేయనున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై అవసరమైతే పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్తో పాటు ఇతర చట్టాల ప్రకారం కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. ప్రజలకు అందాల్సిన బియ్యాన్ని దుర్వినియోగం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు స్పష్టం చేశారు.



సోమవారం - 06 - జూలై 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# భద్రకాళి ఆలయాన్ని రాజకీయ రంగస్థలంగా మార్చొద్దంటూ భక్తుడి నిరసన




- **ఆలయం ముందర ప్లకార్డు పట్టుకుని నిరసన**

**వరంగల్,జులై05(తెలంగాణ ముచ్చట్లు):** భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని రాజకీయాలకు వేదికగా మార్చే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ సామాన్య భక్తుడు శ్రీకాంత్ శాంతియుత నిరసన చేపట్టాడు. ఆలయ పవిత్రతను రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీయడం సరికాదంటూ చేతిలో ప్లకార్డు పట్టుకుని సుమారు రెండు గంటల పాటు ఆలయం ముందు కూర్చుని నిరసన తెలిపాడు.

ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ, "దేవాలయాలు భక్తికి నిలయాలు తప్ప రాజకీయ ప్రదర్శనలకు వేదికలు కావు. భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించడం భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఏ రాజకీయ పార్టీకి కూడా ఆలయ పవిత్రతతో చెలగాటం ఆడే హక్కు లేదు" అని మండిపడ్డాడు.

రాజకీయ లబ్ధి కోసం దేవాలయాలను వేదికలుగా మార్చడం వెంటనే నిలిపివేయాలని, భక్తుల విశ్వాసాన్ని గౌరవించాలని ఆయన డిమాండ్ చేశాడు. దేవాలయాల పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి రాజకీయ పార్టీపై ఉందని స్పష్టం చేశాడు.

"ఇది ఏ ఒక్క పార్టీకి అనుకూలంగా గానీ, వ్యతిరేకంగా గానీ చేపట్టిన నిరసన కాదు. భద్రకాళి అమ్మవారి ఆలయం రాజకీయాలకు అతీతంగా ఉండాలి. దేవాలయాలను రాజకీయాల నుంచి దూరంగా ఉంచడమే నా డిమాండ్" అని పేర్కొన్నాడు. నిరసన సందర్భంగా పలువురు భక్తులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. నిరసన శాంతియుతంగా ముగిసింది.

# ముత్యాలమ్మ సన్నిధిలో మంత్రి పొంగులేటి



- **బోదులబండలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న శీనన్న**
- **అమ్మవారికి ప్రత్యేక పూజలు.. అర్చకుల వేదాశీర్వచనం**
- **భక్తులకు స్వయంగా వడ్డించి.. మహా అన్నదానాన్ని ప్రారంభించిన మంత్రి**

**ఖమ్మం బ్యూరో, జులై 5(తెలంగాణ ముచ్చట్లు ):** జననేత పొంగులేటి శీనన్న రాకతో నేలకొండపల్లి మండలం బోదులబండ గ్రామం రాజకీయ, ఆధ్యాత్మిక కోలాహలంగా మారింది. గ్రామంలో ఆదివారం కనులపండువగా నిర్వహించిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మంగళవాయిద్యాల మోతలు, భక్తుల జయజయధ్వానాల నడుమ ఆలయానికి చేరుకున్న మంత్రి పొంగులేటి.. అమ్మవారి దివ్య స్వరూపాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్నదాన వితరణను ఆయన ఘనంగా ప్రారంభించి, స్వయంగా వడ్డించి అందరినీ ఆకట్టుకున్నారు.

రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

పూజల అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి అర్చకులు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలను బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల మధ్య ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయన్నారు. ముత్యాలమ్మ అమ్మవారి కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు.

# కన్నెపల్లి పంపుహౌజ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం

- **కేటీఆర్‌కు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్**



**జమ్మికుంట టౌన్ జూలై 05 (తెలంగాణ ముచ్చట్లు):** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంపుహౌజ్‌ను సందర్శించేందుకు వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో కలిసి కేటీఆర్‌కు స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, రైతుల శ్రేయస్సు కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటిని అందించేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ప్రస్తుతం నీటి నిల్వలు ఉన్నప్పటికీ పంపింగ్‌లో ప్రభుత్వం విఫలమైందని వారు విమర్శించారు. ఈ నేపథ్యంలో పరిస్థితులను పరిశీలించేందుకు కేటీఆర్ కన్నెపల్లి పంపుహౌజ్‌ను సందర్శించినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొలుగురి సురేష్, చింతల శ్రీనివాస్, మంద రాజేష్‌తో పాటు హుజురాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





# 'కల్లూరులోనే పుట్టి పెరిగా.. ఈ మట్టి రుణం తీర్చుకుంటా'

- **పాలేరు ఎమ్మెల్యేనైనా సత్తుపల్లి నా సొంత ఇల్లే**
- **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**
- **రూ.15 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
- **ఎమ్మెల్యే రాగమయి దయానంద్ తో కలిసి విస్తృత పర్యటన**

**ఖమ్మం బ్యూరో, జులై 5(తెలంగాణ ముచ్చట్లు):** "నేను కల్లూరు మండలంలోనే పుట్టి పెరిగిన వ్యక్తిని. ఈ మట్టితో, ఇక్కడి ప్రజలతో నాకు విడదీయరాని అనుబంధం ఉంది. ప్రస్తుతం పాలేరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ.. సత్తుపల్లి నియోజకవర్గం ఎప్పటికీ నా సొంత ఇల్లే" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సత్తుపల్లి నియోజకవర్గంలో మంత్రి విస్తృతంగా పర్యటించారు. కల్లూరు మండలంలో సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు కీలక మౌలిక వసతుల పనులకు స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌తో కలిసి ఆయన శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తనను ఆదరించిన సొంత గడ్డ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని స్పష్టం చేశారు. కల్లూరు కొత్త మున్సిపాలిటీగా మారిన నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు కేటాయించి సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ఈ రూ.15 కోట్ల పనులతోనే ఆగిపోమని, రాబోయే రోజుల్లో మరిన్ని నిధులతో ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

సంక్షేమం అభివృద్ధి

ప్రజా ప్రభుత్వానికి రెండు కళ్లు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండున్నరేళ్ల కాలంలోనే సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ మార్గదర్శకంగా నిలిచిందని మంత్రి తెలిపారు. ఎన్నికల హామీలనే కాకుండా, చెప్పని ఎన్నో ప్రజా ఉపయోగకర కార్యక్రమాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. పేదల చిరకాల స్వప్నమైన సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని, మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరు చేశామని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా ఇల్లు అందిస్తామన్నారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన కొత్త రేషన్ కార్డుల జారీని పునరుద్ధరించామని, రేషన్ ద్వారా సన్న బియ్యం పంపిణీతో పాటు ప్రతి కుటుంబానికి 200యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు గుర్తుచేశారు.

ఖాతాల్లో రైతు భరోసా..

మహిళలకు లక్ష్మీకటాక్షం

రైతు సంక్షేమమే ధ్యేయంగా ఇప్పటికే రూ.2 లక్షల రుణమాఫీ పూర్తి చేశామని, తాజాగా 'రైతు భరోసా' కింద తొలి విడతగా అర్హులైన రైతుల ఖాతాల్లో రూ.6 వేల చొప్పున జమ చేయడం ప్రారంభమైందని మంత్రి వెల్లడించారు. రైతుల మొబైల్ ఫోన్లకు 'టిగ్..టిగ్' అంటూ మెసేజ్‌లు రావడం మొదలైందని, రాబోయే రెండు మూడు రోజుల్లో అర్హులైన ప్రతి రైతుకూ నిధులు అందుతాయన్నారు. సన్న ధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు రూ.500 ప్రోత్సాహకం ఇస్తూ.. పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. అలాగే, రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని మంత్రి స్పష్టం చేశారు. పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రజల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

రూ.15 కోట్లతో మౌలిక వసతుల కల్పన

మండల పరిధిలో రూ.15 కోట్ల వ్యయంతో పలు ప్రతిష్టాత్మక పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా తిరువూరు ఎక్స్ రోడ్ కల్లూరు జంక్షన్ వద్ద ఖమ్మం అశ్వరావుపేట జాతీయ రహదారి జంక్షన్ అభివృద్ధి పనులను రూ.8.60 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్నారు. అలాగే లోకవరం పెనుబల్లి రహదారిపై రూ.6.30 కోట్ల వ్యయంతో నిర్మించనున్న హైలెవల్ బ్రిడ్జి పనులకు, చిన్నకోరుకొండ కిష్టారం మరియు వైరా నెమలి రహదారుల మధ్య రూ.5 కోట్ల వ్యయంతో చేపట్టే లింక్ రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. వీటితో పాటు నగరాభివృద్ధిలో భాగంగా కల్లూరు ప్రధాన రహదారిలో రూ.93 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న స్ట్రామ్ వాటర్ డ్రైన్ (వరద నీటి కాలువ) పనులను కూడా అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# పనిబత్తిడితో వైద్యుల్లో మానసిక సంక్షోభం

- **ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్న 16.9 శాతం రెసిడెంట్ డాక్టర్లు**
- **ఫైమా సర్వేలో ఆందోళనకర అంశాలు వెల్లడి**
- **తక్షణ సంస్కరణలు అవసరమని నిపుణుల సూచన**

**డెస్క్, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే రెసిడెంట్ వైద్యులు తీవ్ర పనిభారం, మానసిక ఒత్తిడితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తాజా సర్వే వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో పలువురు వైద్యులు తీవ్రమైన ఒత్తిడి, నిద్రలేమి, అధిక పనిగంటల కారణంగా తీవ్ర మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. కొందరిలో ఆత్మహత్య ఆలోచనలు కూడా ఉన్నాయని నివేదిక పేర్కొనడం ఆందోళన కలిగిస్తోంది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) 'రివ్యూ మెడికల్ సిస్టమ్ 2.0' పేరుతో దేశంలోని 28 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 1,260 మంది రెసిడెంట్ వైద్యుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ సర్వే నిర్వహించింది. సర్వే ప్రకారం 87.5 శాతం మంది వైద్యులు తీవ్రమైన మానసిక ఒత్తిడితో బాధపడుతున్నట్లు వెల్లడైంది. 87.8 శాతం మంది నిద్రలేమి సమస్యను ఎదుర్కొంటుండగా, 61.8 శాతం మంది వరుసగా 36 గంటల పాటు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్యూటీ పూర్తయిన తర్వాత కూడా 63.7 శాతం మందికి సరైన విశ్రాంతి లభించడం లేదని సర్వే పేర్కొంది. పనిఒత్తిడి కారణంగా 54.4 శాతం మంది తమ పీజీ రెసిడెన్సీని మధ్యలోనే వదిలివేయాలని ఆలోచిస్తున్నట్లు వెల్లడైంది. మరింత ఆందోళనకరంగా 16.9 శాతం మంది ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్నట్లు సర్వేలో పేర్కొన్నారు. అలాగే 69.1 శాతం మంది పనిభారం అధికంగా ఉందని చెప్పారు. 46.7 శాతం మంది వారానికి 80 గంటలు, 20.3 శాతం మంది వారానికి 100 గంటలకు పైగా విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఆరోగ్యరంగంలో సిబ్బంది కొరత, మానసిక ఆరోగ్యానికి తగిన సహాయక వ్యవస్థ లేకపోవడం, ఉపకారవేతనాల చెల్లింపులో జాప్యం, బాండ్ నిబంధనలు, అధిక పనిభారం వల్ల వైద్య విద్యపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని సర్వే వివరించింది. ఈ నేపథ్యంలో రెసిడెంట్ వైద్యుల పనివేళలపై జాతీయ స్థాయిలో సంస్కరణలు చేపట్టాలని ఫైమా సూచించింది. వరుసగా సుదీర్ఘ డ్యూటీలు కాకుండా విధుల అనంతరం తప్పనిసరిగా విశ్రాంతి కల్పించాలని, ఖాళీలను భర్తీ చేసి వైద్యుల కొరతను తగ్గించాలని కోరింది. ప్రతి వైద్య కళాశాలలో మానసిక ఆరోగ్య కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉంచాలని, దేశవ్యాప్తంగా ఏకరీతి ఉపకారవేతన విధానాన్ని అమలు చేయాలని, బాండ్ విధానంలో మార్పులు తీసుకురావాలని సిఫారసు చేసింది.

రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందాలంటే ముందు వైద్యుల సంక్షేమం, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని సర్వే స్పష్టం చేసింది. రెసిడెంట్ వైద్యుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యవసరంగా పరిష్కరించాలని ఫైమా విజ్ఞప్తి చేసింది.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# గ్రామాభివృద్ధే దేశ ప్రగతికి బలమైన పునాది..!

ప్రపంచ జనాభాలో అధిక శాతం మంది ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. వ్యవసాయం, పశు సంవర్ధక రంగం, చేతివృత్తులు, చిన్నతరహా పరిశ్రమలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయి. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం సమగ్రంగా పురోగమిస్తుందనే భావనతో ప్రతి ఏడాది జులై 6న కొన్ని అంతర్జాతీయ సంస్థలు ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినంను నిర్వహిస్తున్నాయి. గ్రామాల్లో జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, మౌలిక వసతులను బలోపేతం చేయడం, ఉపాధి అవకాశాలను పెంచడం, సుస్థిర అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించడమే ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి అంటే కేవలం రహదారులు, విద్యుత్, తాగునీటి సౌకర్యాలు కల్పించడం మాత్రమే కాదు. నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్య సేవలు, వ్యవసాయానికి ఆధునిక సాంకేతికత, మహిళల సాధికారత, యువతకు నైపుణ్య శిక్షణ, డిజిటల్ సేవలు వంటి అన్ని రంగాల్లో సమాన అభివృద్ధి జరగాల్సి ఉంటుంది. గ్రామాలు అన్ని విధాలుగా బలపడినప్పుడే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత దృఢంగా మారుతుంది.

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో గ్రామీణ ప్రాంతాల పాత్ర అత్యంత కీలకం. దేశంలోని లక్షలాది మంది రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తిదారులు, గ్రామీణ మహిళలు తమ శ్రమతో దేశ ఆహార భద్రతను, ఆర్థికాభివృద్ధిని నిలబెడుతున్నారు. వ్యవసాయం మాత్రమే కాకుండా పాడి పరిశ్రమ, మత్స్య పరిశ్రమ, తేనెటీగల పెంపకం, కోళ్ల పరిశ్రమ వంటి అనుబంధ రంగాలు కూడా గ్రామీణ కుటుంబాలకు స్థిరమైన ఆదాయ వనరులుగా మారుతున్నాయి. ఇటీవలి కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాయి. గ్రామీణ రహదారుల నిర్మాణం, ఇంటింటికీ తాగునీటి సరఫరా, డిజిటల్ సేవల విస్తరణ, గ్రామ పంచాయతీల బలోపేతం, స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహం, రైతులకు సాంకేతిక సహాయం వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. గ్రామాల్లో మెరుగైన సౌకర్యాలు పెరగడంతో నగరాలకు వలసలు కొంత మేర తగ్గే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

మహిళల భాగస్వామ్యం గ్రామీణాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. స్వయం సహాయక సంఘాల ద్వారా వేలాది మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు సృష్టించుకుంటూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుస్తున్నారు. చిన్న వ్యాపారాలు, ఆహార ఉత్పత్తుల తయారీ, పాడి పరిశ్రమ, చేతిపనులు వంటి రంగాల్లో మహిళలు విజయవంతంగా ముందుకు సాగుతున్నారు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపును ఇస్తోంది. యువత గ్రామాభివృద్ధిలో కీలక శక్తిగా మారుతోంది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సేంద్రియ సాగు, డ్రోన్ సాంకేతికత, డిజిటల్ మార్కెటింగ్, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించే పరిశ్రమల ఏర్పాటు వంటి రంగాల్లో యువత ముందుకు వస్తోంది. దీంతో గ్రామాల్లోనే ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. అయితే గ్రామీణాభివృద్ధికి ఇంకా అనేక సవాళ్లు ఉన్నాయి. వాతావరణ మార్పులు, నీటి కొరత, వ్యవసాయ వ్యయాల పెరుగుదల, మార్కెట్‌లో ధరల అస్థిరత, వైద్య, విద్యా సౌకర్యాల కొరత, నిరుద్యోగం వంటి సమస్యలు గ్రామీణ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. ఈ సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారాలు చూపాల్సిన అవసరం ఉంది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో గ్రామాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఉంది. పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, పునరుత్పాదక ఇంధన వినియోగం, సేంద్రియ వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలను గ్రామీణాభివృద్ధితో అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించవచ్చు. ప్రపంచ గ్రామీణాభివృద్ధి దినం సందర్భంగా గ్రామాల అభివృద్ధి ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యం కూడా అంతే ముఖ్యమని గుర్తు చేస్తున్నారు. స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, యువత, మహిళా సంఘాలు, రైతు సంఘాలు కలిసి పనిచేస్తే గ్రామాలు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తాయి.

# స్వయం సమృద్ధి వైపు భారత్



భారత్ ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తోంది. అయితే ఒక దేశం నిజమైన అర్థంలో అభివృద్ధి చెందాలంటే కేవలం ఆర్థిక వృద్ధి గణాంకాలు పెరగడం మాత్రమే సరిపోదు. ఉత్పత్తి, సాంకేతికత, పరిశోధన, ఉపాధి, ఆవిష్కరణలు, రక్షణ, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించినప్పుడే ఆ దేశం ప్రపంచ వేదికపై ధైర్యంగా నిలబడగలదు. అందుకే స్వయం సమృద్ధి ఇప్పుడు ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును నిర్ణయించే జాతీయ లక్ష్యంగా మారింది. ప్రపంచ రాజకీయాలు, వాణిజ్య పరిస్థితులు వేగంగా మారుతున్న తరుణంలో స్వయం సమృద్ధి సాధించడం భారత్‌కు అత్యంత అవసరంగా కనిపిస్తోంది. కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలకు ఒక కీలకమైన పాఠాన్ని నేర్పింది. అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలు, ముడి సరుకులు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు వంటి అనేక వస్తువుల కోసం ఇతర దేశాలపై అధికంగా ఆధారపడితే ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయో ప్రపంచం ప్రత్యక్షంగా చూసింది. ఈ అనుభవం తర్వాత ప్రతి దేశం తన దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. భారత్ కూడా అదే దిశగా ముందుకు సాగుతూ దేశంలోనే ఎక్కువ ఉత్పత్తులు తయారయ్యేలా పరిశ్రమలను ప్రోత్సహించడం ప్రారంభించింది. దీని వల్ల దేశీయ పరిశ్రమలు బలోపేతం కావడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక అంతర్జాతీయ సంస్థలు తమ ఉత్పత్తి కేంద్రాలను కొత్త దేశాలకు విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. చైనా తర్వాత ప్రత్యామ్నాయ తయారీ కేంద్రంగా భారత్‌పై ప్రపంచ దృష్టి పడుతోంది. విస్తారమైన మార్కెట్, యువ జనాభా, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మెరుగవుతున్న మౌలిక వసతులు, డిజిటల్ వ్యవస్థల విస్తరణ వంటి అంశాలు భారత్‌కు అనుకూలంగా మారాయి. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోగలిగితే భారత్ ప్రపంచ తయారీ రంగంలో కీలక స్థానాన్ని సంపాదించే అవకాశం ఉంది. దీనివల్ల విదేశీ పెట్టుబడులు మాత్రమే కాదు, సాంకేతిక పరిజ్ఞానం కూడా దేశంలోకి వస్తుంది. స్వయం సమృద్ధి సాధించడంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పాత్ర అత్యంత కీలకం. దేశంలోని కోట్లాది మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగం బలోపేతం అయితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలపడుతుంది. స్థానికంగా తయారయ్యే వస్తువులకు ఆధునిక సాంకేతికతను జోడించి ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లే సామర్థ్యాన్ని పెంచాలి. నాణ్యమైన ఉత్పత్తులు తయారు చేయడానికి అవసరమైన శిక్షణ, ఆర్థిక సహాయం, మార్కెటింగ్ అవకాశాలు అందుబాటులో ఉంటే చిన్న పరిశ్రమలు కూడా ప్రపంచ స్థాయిలో పోటీ పడగలవు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. వ్యవసాయ రంగంలో స్వయం సమృద్ధి సాధించడం కూడా అంతే ముఖ్యమైనది. భారత్ ఇప్పటికే ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచంలో అగ్రగామి దేశాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ విలువ ఆధారిత ఉత్పత్తులు, ఆహార శుద్ధి పరిశ్రమలు, ఎగుమతుల విషయంలో ఇంకా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. రైతు పండించిన పంటకు సరైన విలువ లభించాలంటే ఉత్పత్తిని నేరుగా మార్కెట్‌కు అనుసంధానించే వ్యవస్థలు బలోపేతం కావాలి. సేంద్రియ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులు, నీటి నిర్వహణ, నిల్వ సౌకర్యాలు మెరుగుపడితే వ్యవసాయం కూడా దేశ ఆర్థికాభివృద్ధికి మరింత బలమైన ఆధారంగా మారుతుంది. సాంకేతిక రంగం భారత స్వయం సమృద్ధికి ప్రధాన బలంగా నిలుస్తోంది. కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, అంతరిక్ష పరిశోధన, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, విద్యుత్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాల్లో భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ప్రపంచంలోని ప్రముఖ సాంకేతిక సంస్థల్లో భారతీయ యువత తమ ప్రతిభను నిరూపిస్తున్నారు. అదే ప్రతిభ దేశీయ పరిశోధన, ఆవిష్కరణలు, పరిశ్రమల అభివృద్ధికి ఉపయోగపడేలా ప్రోత్సహించగలిగితే ప్రపంచ సాంకేతిక రంగంలో భారత్ మరింత శక్తివంతమైన దేశంగా ఎదుగుతుంది. పరిశోధనకు పెట్టుబడులు పెరగడం, విద్యా సంస్థలుపరిశ్రమల మధ్య అనుసంధానం పెరగడం ఈ దిశగా ఎంతో అవసరం. స్వయం సమృద్ధి అంటే విదేశీ వస్తువులను పూర్తిగా తిరస్కరించడం కాదనే విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. ప్రపంచీకరణ యుగంలో అంతర్జాతీయ వాణిజ్యం ప్రతి దేశానికి అవసరమే. కానీ దేశ ప్రయోజనాలకు సంబంధించిన కీలక రంగాల్లో విదేశాలపై పూర్తిగా ఆధారపడకుండా, అవసరమైన ఉత్పత్తులను దేశంలోనే తయారు చేసుకునే సామర్థ్యం కలిగి ఉండటమే అసలైన స్వయం సమృద్ధి. ప్రపంచంతో పోటీ పడే నాణ్యత, తక్కువ ఉత్పత్తి వ్యయం, వేగవంతమైన సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేసుకోవడమే ఈ లక్ష్యానికి మూలం. అయితే ఈ ప్రయాణంలో అనేక సవాళ్లు కూడా ఉన్నాయి. నాణ్యమైన మౌలిక వసతులు, విద్యుత్ సరఫరా, రవాణా వ్యవస్థ, పరిశోధనకు తగిన నిధులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన ఉత్పత్తి విధానాలు లేకపోతే ఆశించిన ఫలితాలు రావు. అంతర్జాతీయ మార్కెట్లో పోటీ తీవ్రమవుతున్న నేపథ్యంలో భారతీయ ఉత్పత్తులు నాణ్యత, విశ్వసనీయత, సాంకేతికత పరంగా ముందుండాలి. ఇందుకోసం ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుంది.

# ముద్దు.. మనసులను కలిపే మౌన భాష..!



ప్రతి ఏడాది జులై 6న ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ ముద్దు దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగం, గౌరవం, విశ్వాసం వంటి భావాలను మాటలు లేకుండానే వ్యక్తపరిచే అత్యంత సహజమైన భావప్రకటన ముద్దు. ఇది కేవలం ప్రేమికుల మధ్య ఉండే భావోద్వేగానికి మాత్రమే పరిమితం కాదు. తల్లి తన బిడ్డను ముద్దాడడం నుంచి తండ్రి ప్రోత్సాహంగా నుదిటిపై ముద్దు పెట్టడం వరకు, కుటుంబ సభ్యులు, జీవిత భాగస్వాములు, సన్నిహితుల మధ్య ఉన్న బంధానికి ఇది ప్రతీకగా నిలుస్తుంది. మనిషి జీవితంలో ప్రేమ ఎంత అవసరమో గుర్తు చేసే ప్రత్యేక సందర్భమే ఈ దినోత్సవం. ఈ దినోత్సవం ఆవిర్భావం బ్రిటన్‌లో జరిగింది. కాలక్రమేణా ప్రపంచంలోని అనేక దేశాలు దీనిని గుర్తించి జులై 6న నిర్వహించడం ప్రారంభించాయి. ఆధునిక జీవనశైలిలో బిజీగా మారిపోయిన మనుషులు పరస్పర అనుబంధాలకు తక్కువ సమయం కేటాయిస్తున్న నేపథ్యంలో కుటుంబ బంధాలు, మానవీయ విలువలు, ప్రేమాభిమానాలను గుర్తు చేయాలనే ఉద్దేశంతో ఈ దినోత్సవాన్ని జరుపుతున్నారు. ఆప్యాయతతో కూడిన ఒక చిన్న ముద్దు కూడా మనసుల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించగలదనే సందేశాన్ని ఈ రోజు ప్రపంచానికి తెలియజేస్తోంది. మనోవిజ్ఞాన నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రేమతో ఇచ్చే ముద్దు మనసుపై సానుకూల ప్రభావం చూపుతుంది. ముద్దు సమయంలో శరీరంలో ఆనందాన్ని కలిగించే హార్మోన్లు విడుదల కావడంతో ఒత్తిడి తగ్గడం, ఆందోళన తగ్గడం, మానసిక ప్రశాంతత పెరగడం వంటి ప్రయోజనాలు కలగవచ్చని పలు పరిశోధనలు సూచిస్తున్నాయి. ప్రేమ, విశ్వాసం, భద్రత వంటి భావాలు బలపడటంలో కూడా ఇది సహాయపడుతుంది. అయితే ఇవి ఆరోగ్యకరమైన సంబంధాలు, పరిశుభ్రమైన పరిస్థితుల్లోనే వర్తిస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తల్లి తన శిశువును ముద్దాడినప్పుడు ఆ బిడ్డకు భద్రత, ప్రేమ, ఆత్మీయత అనే భావాలు కలుగుతాయి. చిన్నారుల భావోద్వేగ వికాసంలో తల్లిదండ్రుల ప్రేమాభిమానాలు కీలక పాత్ర పోషిస్తాయి. పెద్దలు పిల్లలను ముద్దాడడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరగడమే కాకుండా కుటుంబ సభ్యుల మధ్య అనుబంధం మరింత బలపడుతుంది. అందుకే చిన్నప్పటి నుంచి ప్రేమతో పెరిగిన పిల్లలు సమాజంలో సానుకూల వ్యక్తిత్వాన్ని పెంపొందించుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

భార్యాభర్తల మధ్య ముద్దు అనేది కేవలం ప్రేమకు మాత్రమే కాదు, పరస్పర విశ్వాసానికి, గౌరవానికి, భావోద్వేగ అనుబంధానికి కూడా ప్రతీక. వేగంగా మారుతున్న జీవనశైలిలో ఉద్యోగ ఒత్తిడులు, ఆర్థిక సమస్యలు, సమయాభావం కారణంగా దాంపత్య జీవితంలో దూరాలు పెరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో పరస్పరం ఆప్యాయంగా మాట్లాడుకోవడం, చిన్న చిన్న ప్రేమాభిమానాలను వ్యక్తం చేయడం బంధాన్ని మరింత బలపరుస్తుంది. కుటుంబ జీవితంలో సంతోషానికి ఇటువంటి చిన్న భావోద్వేగాలే బలమైన పునాది అవుతాయి. ప్రపంచంలోని వివిధ దేశాల్లో ముద్దు పెట్టుకునే సంప్రదాయాలు భిన్నంగా ఉంటాయి. కొన్ని దేశాల్లో చెంపపై ముద్దు పెట్టడం గౌరవ సూచకంగా భావిస్తే, మరికొన్ని ప్రాంతాల్లో అది ఆప్యాయతకు ప్రతీకగా ఉంటుంది. కొన్ని సంస్కృతుల్లో పెద్దలకు నుదిటిపై ముద్దు పెట్టడం ఆశీర్వాదాన్ని స్వీకరించినట్లుగా భావిస్తారు. భారతీయ సంస్కృతిలో కూడా తల్లిదండ్రులు, పిల్లలు, కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయతకు ముద్దు ఒక సహజమైన భావప్రకటనగా కొనసాగుతోంది. సంస్కృతులు వేర్వేరు అయినప్పటికీ ప్రేమను వ్యక్తం చేసే భావం మాత్రం ప్రపంచమంతటా ఒకటే. వైద్య నిపుణులు సూచించిన ప్రకారం వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం అత్యంత అవసరం. జలుబు, ఫ్లూ, వైరల్ ఇన్ఫెక్షన్లు, నోటి వ్యాధులు వంటి అంటువ్యాధులు ఉన్న సమయంలో ముద్దు ద్వారా సూక్ష్మ క్రిములు వ్యాపించే అవకాశం ఉంటుంది. అందువల్ల నోటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, దంతాలను శుభ్రంగా ఉంచుకోవడం, ఆరోగ్య సమస్యలు ఉన్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. ప్రేమను వ్యక్తం చేయడంలో ఆరోగ్య భద్రతను కూడా విస్మరించకూడదని వైద్యులు సూచిస్తున్నారు. డిజిటల్ యుగంలో సామాజిక మాధ్యమాలు, సందేశాలు, వీడియో కాల్స్ ద్వారా సంభాషణలు పెరిగినా, ప్రత్యక్షంగా వ్యక్తమయ్యే ప్రేమాభిమానాలకు ప్రత్యామ్నాయం లేదు. ఒక ఆప్యాయమైన పలకరింపు, ఓదార్పుగా భుజంపై చేయి వేయడం, నుదిటిపై ప్రేమగా ముద్దు పెట్టడం వంటి చిన్న చిన్న చర్యలు మానవ సంబంధాలను మరింత బలపరుస్తాయి. ఇవి ఒంటరితనాన్ని తగ్గించి కుటుంబ సభ్యుల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అంతర్జాతీయ ముద్దు దినోత్సవం పేరును కొందరు ప్రేమికుల దినంగా మాత్రమే భావించినప్పటికీ, వాస్తవానికి ఇది మానవ సంబంధాల విలువను గుర్తు చేసే రోజు. తల్లిదండ్రులు, పిల్లలు, జీవిత భాగస్వాములు, సోదరులు, సోదరీమణులు, స్నేహితులు ఇలా ప్రతి బంధంలోనూ ప్రేమ, గౌరవం, ఆప్యాయత అవసరమని ఈ దినోత్సవం గుర్తు చేస్తుంది. మాటలతో చెప్పలేని అనేక భావాలను ఒక చిన్న ముద్దు ఎంతో అందంగా వ్యక్తపరచగలదనే సందేశాన్ని ప్రపంచానికి అందిస్తోంది. నేటి సమాజంలో ఒత్తిడులు, విభేదాలు, స్వార్థపూరిత జీవనశైలి కారణంగా మానవ సంబంధాలు క్రమంగా బలహీనపడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రేమను పంచుకోవడం, కుటుంబంతో సమయం గడపడం, ఆప్యాయతను వ్యక్తం చేయడం, ఒకరినొకరు గౌరవించడం ఎంతో అవసరం. అంతర్జాతీయ ముద్దు దినోత్సవం అలాంటి విలువలను మరోసారి గుర్తు చేస్తూ, మనసులను కలిపే ప్రేమే ప్రపంచాన్ని మరింత అందంగా మారుస్తుందనే సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేస్తోంది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# 'రౌడీ జనార్ధన'లో బాలీవుడ్ బ్యూటీ ?

విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు రవి కిరణ్ కోలా తెరకెక్కిస్తున్న సినిమా 'రౌడీ జనార్ధన'. ఈ సినిమాలో ఓ ఐటెం సాంగ్ అనుకుంటున్నారు. ఈ సాంగ్ లో విజయ్ దేవరకొండతో కలిసి డాన్స్ చేయడానికి అనన్య పాండేను తీసుకోబోతున్నారని తెలుస్తోంది. మరి ఇప్పుడు విజయ్ దేవరకొండ అనన్య పాండే స్పెషల్ సాంగ్ చేస్తోందో లేదో చూడాలి. అన్నట్టు ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్ లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్ లో కనిపిస్తాడట.

పైగా విజయ్ దేవరకొండ యాక్షన్ సీన్స్ సినిమా మొత్తంలోనే మెయిన్ హైలైట్ గా ఉంటాయట. స్టార్ ప్రొడ్యూసర్ దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరో రాజశేఖర్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. అన్నట్టు రాజశేఖర్ పాత్ర అండ్ ఆయన లుక్ మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుందట. కాగా ఈ సినిమా కథ గ్రామీణ నేపథ్యంలో సాగనుంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా కీర్తి సురేశ్ నటించనుంది. మొత్తానికి ఈ సినిమా పై భారీ అంచనాలు ఉన్నాయి. మరి ఈ సినిమా ఏ రేంజ్ లో ఉంటుందో చూడాలి.

## కార్తీక్ వర్సెస్ ఇబ్రహీం

# శ్రీలీల పెద్ద రిస్క్!

శ్రీలీల బాలీవుడ్ ఎంట్రీ ప్రస్తుతం తీవ్ర కన్ఫ్యూజన్‌లో పడింది. కార్తీక్ ఆర్యన్ హీరోగా అనురాగ్ బసు దర్శకత్వంలో రావాల్సిన సినిమా కార్తీక్ వరుస ఫ్లాపులు , 'సయ్యారా' సినిమా తెచ్చిన కంపారిజన్ భయాల వల్ల జూలై 2026 అవుతున్నా ఇంకా వాయిదా పడుతూనే ఉంది. ఈ ఆలస్యం భరించలేక శ్రీలీల ఇప్పుడు సైఫ్ అలీ ఖాన్ కొడుకు ఇబ్రహీం అలీ ఖాన్ సరసన 'దిలేర్' సినిమాతో హిందీ ఎంట్రీ ఇవ్వడానికి రెడీ అవుతున్నట్లు టాక్. మ్యాడాక్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని దీపావళికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే ఈ నిర్ణయం శ్రీలీలకు పెద్ద రిస్క్ అనే చెప్పాలి. కార్తీక్ ఆర్యన్‌కు మార్కెట్, స్టార్ ఇమేజ్ ఉన్నాయి. కానీ ఇబ్రహీం అలీ ఖాన్‌కు అస్సలు థియేట్రికల్ మార్కెట్ లేదు, పైగా అతని గత రెండు ఓటీటీ సినిమాలు ఘోరంగా ట్రోల్ అయ్యాయి. స్టార్ హీరోతో లేట్ అయినా క్రేజీ లాంచ్ బెటరా, లేక బజ్ లేని హీరోతో స్పీడ్‌గా ఎంట్రీ ఇవ్వడం బెటరా అనే డైలామాలో శ్రీలీల చిక్కుకుంది.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# శ్రీరాంబాగ్ బస్తీలో ఓపెన్ జిమ్ ప్రారంభించిన కిషన్ రెడ్డి

- ఫిట్ ఇండియా స్ఫూర్తితో ఆరోగ్యంపై అవగాహన
- ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపు
- స్థానికుల కోసం ఆధునిక వసతులతో జిమ్ ఏర్పాటు



హైదరాబాద్, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి ఆదివారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మల్లేపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరాంబాగ్ బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా రాంలీలా గ్రౌండ్‌లో స్థానికుల వినియోగం కోసం ఏర్పాటు చేసిన ఆధునిక ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. అనంతరం స్థానిక ప్రజలు, యువతతో మాట్లాడి ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన "ఫిట్ ఇండియా" పిలుపు దేశవ్యాప్తంగా ఆరోగ్య చైతన్యాన్ని పెంచిందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం ద్వారా అనేక జీవనశైలి వ్యాధులను దూరం చేసుకోవచ్చని సూచించారు.

శ్రీరాంబాగ్‌లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరికీ ఉపయోగపడేలా ఆధునిక పరికరాలతో రూపొందించబడిందని తెలిపారు. యువత శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇలాంటి వసతులు కీలకపాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన సౌకర్యాలను కూడా విస్తరిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. పార్కులు, ఓపెన్ జిమ్‌లు, వాకింగ్ ట్రాక్‌లు వంటి ప్రజా వసతుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమని అన్నారు.

స్థానికులు ఈ ఓపెన్ జిమ్‌ను పరిశుభ్రంగా ఉంచుతూ నిరంతరం వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. వ్యాయామం కేవలం యువతకే కాకుండా అన్ని వయసుల వారికి అవసరమని, ప్రతి కుటుంబం ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యమే మహాభాగ్యమనే భావనతో ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఓపెన్ జిమ్ ఏర్పాటుతో స్థానిక ప్రజలకు మెరుగైన ఆరోగ్య సదుపాయం అందుబాటులోకి రావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

# నల్గొండలో ఘోర రోడ్డు ప్రమాదం..

- బాలుడితో సహా నలుగురు దుర్మరణం
- జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సు ఢీకొన్న కారు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు.. దర్యాప్తు ప్రారంభం



నల్గొండ, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

నల్గొండ జిల్లాలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం నలుగురి ప్రాణాలను బలిగొంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో అతివేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కారును వెనుక నుంచి ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడితో పాటు ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, కారు డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, హైదరాబాద్ వైపు ప్రయాణిస్తున్న కారును వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన వేగానికి కారు పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రత ఎంత ఘోరంగా ఉందంటే కారులో ప్రయాణిస్తున్న వారికి బయటపడే అవకాశం లేకుండా పోయింది. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు, అత్యవసర సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే నలుగురు మృతి చెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన కారు డ్రైవర్‌ను వెంటనే నార్కట్‌పల్లిలోని కామినేని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదంలో మృతి చెందినవారు తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన ఒకే కుటుంబ సభ్యులుగా పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం వారు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కుటుంబ సభ్యుల ఆకస్మిక మృతితో బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు నల్గొండకు చేరుకున్నారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రమాదానికి గల కారణాలను ఆరా తీస్తున్నారు. ట్రావెల్స్ బస్సు అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడపొద్దని పోలీసులు మరోసారి విజ్ఞప్తి చేశారు.



# వృద్ధురాలిని బావిలోకి తోసేసిన డిగ్రీ విద్యార్థి అరెస్ట్

- రుణాల ఒత్తిడితో దొంగతనానికి పథకం
- నగలు దోచుకుని హత్యాయత్నం చేసిన యువకుడు
- సీసీటీవీ, ర్యాపిడో వివరాలతో నిందితుడి అరెస్ట్

జగిత్యాల, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసైన ఓ డిగ్రీ విద్యార్థి డబ్బు కోసం దారుణానికి ఒడిగట్టాడు. పని ఇప్పిస్తానని నమ్మించి ఓ వృద్ధురాలిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి ఆమె వద్ద ఉన్న బంగారం, వెండి నగలు దోచుకుని అనంతరం బావిలోకి తోసేసిన ఘటన జగిత్యాల జిల్లాలో కలకలం రేపింది. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం, జగిత్యాల జిల్లా గుల్లపేట గ్రామానికి చెందిన దమ్మ దినేష్ రెడ్డి (21) కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు బానిసైన అతడు దాదాపు రూ.4 లక్షలు నష్టపోయాడు. దీంతో లోన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకోగా, వాటిని వెంటనే చెల్లించాలని నిర్వాహకులు తీవ్ర ఒత్తిడి తీసుకురావడంతో డబ్బు కోసం దొంగతనానికి పథకం రచించాడు.

ఈ నెల 1న కూలి పనుల కోసం లేబర్ అడ్డా వద్ద నిలబడి ఉన్న గంగాధర లక్ష్మి అనే వృద్ధురాలి వద్దకు వెళ్లిన దినేష్‌రెడ్డి, పని ఇప్పిస్తానని నమ్మించి నసుల్తాపూర్ శివారులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమె వద్ద ఉన్న అర తులం బంగారం, సుమారు 20 గ్రాముల వెండి ఆభరణాలను బలవంతంగా లాక్కొని, అనంతరం ఆధారాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో వృద్ధురాలిని బావిలోకి తోసి అక్కడి నుంచి పరారయ్యాడు. బావిలో పడిపోయిన వృద్ధురాలు తీవ్ర గాయాలతో సుమారు 21 గంటలపాటు ప్రాణాలతో పోరాడింది. మరుసటి రోజు ఉదయం స్థానిక గ్రామస్తులు ఆమె అరుపులు విని బావి వద్దకు చేరుకుని బయటకు తీశారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతున్నట్లు సమాచారం.

ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సంఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారు. నిందితుడు ఉపయోగించిన ర్యాపిడో బుకింగ్‌కు సంబంధించిన ఫోన్ నంబర్‌ను గుర్తించి సాంకేతిక ఆధారాలతో కరీంనగర్ అమరవీరుల స్తూపం సమీపంలో అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నేరాన్ని అంగీకరించిన నిందితుడు దోచుకున్న బంగారాన్ని టవర్ సర్కిల్ వద్ద వేణు మనోహరాచారి అనే బంగారం వ్యాపారికి విక్రయించి రూ.30 వేల నగదు తీసుకున్నట్లు వెల్లడించాడు. నిందితుడితో పాటు దొంగిలించిన బంగారాన్ని కొనుగోలు చేసిన వ్యాపారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, గేమింగ్ వ్యసనం యువతను నేరాల బాట పట్టిస్తున్నాయని ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోందని పోలీసులు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత అక్రమ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# కాంగ్రెస్ హామీలపై పోరాటం కొనసాగాలి: తలసాని

- తెలంగాణ భవన్‌లో జూబ్లీహిల్స్ సమావేశం
- ఎస్ఐఆర్‌పై అప్రమత్తంగా ఉండాలని సూచన
- పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం




హైదరాబాద్, జులై 4 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అదే సమయంలో దొంగ ఓట్లను గుర్తించి తొలగించేలా కృషి చేయాలని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి యువకుడు ఓటరుగా నమోదు అయ్యేలా పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రంజాన్, బతుకమ్మ, క్రిస్మస్ వంటి అన్ని పండుగలను ఘనంగా నిర్వహించామని తలసాని గుర్తు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అప్పులు చేసినప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామని, ప్రస్తుత ప్రభుత్వం అప్పులు చేసినా ప్రజలకు ప్రయోజనం చేకూరే పనులు కనిపించడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించిందని, పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు చేసిన పోరాటాన్ని ఎవరూ మరచిపోలేరని తలసాని పేర్కొన్నారు. దివంగత మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. పార్టీ నాయకులు ఐక్యంగా పనిచేస్తూ ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని తలసాని పిలుపునిచ్చారు. ఎన్నికల హామీల అమలుపై నిరంతరం పోరాటం కొనసాగించాలని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు.



# టవర్ ఎక్కి ప్రేమ ప్రపోజల్

- చివరికి పోలీసుల రంగప్రవేశం
- వైరల్ వీడియోతో సాహసం
- ప్రమాదం నుంచి జంట రక్షణ
- ప్రాణాలతో చెలగాటం వద్దని హెచ్చరిక

పాట్నా, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

సోషల్ మీడియాలో వైరల్ అయిన ఓ విదేశీ జంట వీడియోను అనుకరించేందుకు ప్రయత్నించిన బిహార్‌కు చెందిన ప్రేమ జంట ప్రమాదంలో చిక్కుకుంది. ప్రేమ ప్రపోజల్ కోసం హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కేందుకు ప్రయత్నించగా, సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి ఇద్దరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసుల వివరాల ప్రకారం, ఇటీవల రష్యాకు చెందిన ఓ జంట అమెరికాలోని ఎంపైర్ స్టేట్ భవనంపై ప్రేమను వ్యక్తం చేసిన వీడియో వైరల్ కావడంతో దాని స్ఫూర్తితో బిహార్‌కు చెందిన ఈ జంట కూడా అలాంటి ప్రయత్నం చేసింది. ఇందుకోసం వారు ఎత్తైన హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కడం ప్రారంభించారు.

ఈ దృశ్యాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అప్పటికే ప్రేమజంట టవర్‌పై ప్రమాదకరమైన ఎత్తుకు చేరుకుంది. విద్యుత్ టవర్ కావడంతో ప్రాణాపాయం ఎక్కువగా ఉండటంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రక్షణ చర్యలు ప్రారంభించారు. పోలీసు సిబ్బంది కూడా టవర్ ఎక్కి ప్రేమజంటను నచ్చజెప్పి కిందికి దిగేలా చేశారు. ఎంతో అప్రమత్తంగా వ్యవహరించి ఇద్దరినీ సురక్షితంగా కిందికి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ఘటనపై స్పందించిన పోలీసులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే వీడియోలను అనుకరించే క్రమంలో ప్రాణాలను ప్రమాదంలో పడేయొద్దని సూచించారు. క్షణికావేశంలో ఇలాంటి ప్రమాదకర విన్యాసాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. మరోవైపు ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు కూడా ఆ జంట తీరును తప్పుబడుతున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావంతో ప్రమాదకర చర్యలకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

# ఇన్‌స్టాగ్రామ్‌కు కేంద్రం నోటీసులు

- అభ్యంతరకర ప్రకటనలపై ఆగ్రహం
- వారంలోగా వివరణ ఇవ్వాలని ఆదేశం
- చట్టపరమైన చర్యల హెచ్చరిక

న్యూఢిల్లీ, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):

పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర ప్రకటనలు ప్రసారమవుతున్నాయన్న ఆరోపణలపై ఇన్‌స్టాగ్రామ్ మాతృసంస్థ మెటాకు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. అభ్యంతరకర ప్రకటనలను తక్షణమే తొలగించాలని ఆదేశించిన కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ, ఈ వ్యవహారంపై పూర్తి వివరణను వారం రోజుల్లోగా సమర్పించాలని సూచించింది.



ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దోపిడీని ప్రోత్సహించేలా కనిపిస్తున్న చెల్లింపు ప్రకటనలు ప్రసారమవుతున్నట్లు వెలుగులోకి రావడంతో కేంద్రం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి కంటెంట్‌ను వెంటనే తొలగించడంతో పాటు భవిష్యత్తులో పునరావృతం కాకుండా తీసుకుంటున్న చర్యలను వివరించాలని మెటాను ఆదేశించింది.

ఈ అంశంపై ఇటీవల అంతర్జాతీయ మీడియా కథనం వెలువడిన అనంతరం విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై స్పందించిన కేంద్ర సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, వెంటనే నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించగా, ఆదివారం సంబంధిత శాఖ మెటాకు అధికారిక నోటీసులు పంపింది. అభ్యంతరకర ప్రకటనలు ఎలా అనుమతించబడ్డాయో, వాటి నియంత్రణకు ఎలాంటి వ్యవస్థ అమల్లో ఉందో వివరించాలని కేంద్రం కోరింది. అలాగే భవిష్యత్తులో ఇలాంటి కంటెంట్‌ను గుర్తించి అడ్డుకునేందుకు అనుసరించబోయే విధానాలపై కూడా స్పష్టమైన నివేదిక ఇవ్వాలని సూచించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపిస్తున్న కొన్ని ప్రకటనలపై క్లిక్ చేస్తే ఇతర వేదికలకు మళ్లించి అభ్యంతరకర కంటెంట్‌ను అందిస్తున్నట్లు కేంద్రం గుర్తించినట్లు సమాచారం. ప్రకటనల ద్వారా ఆదాయం లభిస్తున్నందున వాటి పర్యవేక్షణ బాధ్యత నుంచి సంస్థ తప్పించుకోలేదని కేంద్రం స్పష్టం చేసింది. మెటా సమర్పించే వివరణ సంతృప్తికరంగా లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. సామాజిక మాధ్యమాల్లో పిల్లల భద్రతకు భంగం కలిగించే, చట్టవ్యతిరేక కంటెంట్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# వాయుగుండం ప్రభావం.. భారీ వర్షాల హెచ్చరిక

- ఒడిశా తీరం వైపు వాయుగుండం
- తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన
- మత్స్యకారులకు సముద్రయాన నిషేధం

**డెస్క్, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):**

వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారిందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఈ వ్యవస్థ ఒడిశాలోని బాలాసోర్‌కు దక్షిణ-ఆగ్నేయ దిశలో కేంద్రీకృతమై ఉందని, రానున్న 24 గంటల్లో ఉత్తర ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. వాతావరణ శాఖ అంచనా ప్రకారం వాయుగుండం పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ బాలాసోర్ సమీపంలో చాంద్‌బలి-దిఘా మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉంది. అనంతరం ఉత్తర ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్ వైపు పయనించనుందని పేర్కొంది. దీని ప్రభావంతో అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు స్థానిక అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. సముద్ర తీర ప్రాంతాల్లో గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించింది. ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే సురక్షితంగా తీరానికి చేరుకోవాలని కోరింది.

వర్షాల కారణంగా ఒడిశాలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలతో ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణ అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానిక యంత్రాంగం జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు, వరద ప్రవాహాలు, నీటితో నిండిన రహదారుల వద్ద జాగ్రత్తగా ఉండాలని, అవసరం లేకుండా బయటకు వెళ్లకపోవడం మంచిదని సూచించారు.






# కోల్‌కతాలో అదానీ 2,000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- పేదలకు వెయ్యి పడకలు ఉచితం
- న్యూ టౌన్‌లో భారీ ఆరోగ్య ప్రాజెక్టు
- ఆరోగ్య రంగంలో అదానీ మరో ముందడుగు

**కోల్‌కతా, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):** పారిశ్రామిక దిగ్గజం అదానీ గ్రూప్ పశ్చిమ బెంగాల్‌లో భారీ ఆరోగ్య ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. కోల్‌కతా సమీపంలోని న్యూ టౌన్ ప్రాంతంలో 2,000 పడకల సామర్థ్యంతో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించనున్నట్లు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి ప్రకటించారు. ఇందులో 1,000 పడకలను పేద రోగులకు పూర్తిగా ఉచిత వైద్య సేవల కోసం కేటాయించనున్నట్లు వెల్లడించారు. భవానీపూర్ నియోజకవర్గంలో పౌర సమాజ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఈ ఆస్పత్రి నిర్మాణానికి అదానీ గ్రూప్ లిఖితపూర్వక హామీ ఇచ్చిందన్నారు. మిగిలిన 1,000 పడకలను సాధారణ వాణిజ్య వైద్య సేవల కోసం వినియోగిస్తారని తెలిపారు. అయితే ప్రాజెక్టు వ్యయం, నిర్మాణ కాలపట్టికకు సంబంధించిన వివరాలను ఇంకా వెల్లడించలేదు.




ఆరోగ్య రంగంలో సామాజిక బాధ్యతలో భాగంగా అదానీ గ్రూప్ ఇప్పటికే పలు కార్యక్రమాలు చేపడుతోంది. బీహార్‌లో అఖండ జ్యోతి ఆస్పత్రితో కలిసి కంటి వైద్య కేంద్రాన్ని ప్రారంభించగా, ఢిల్లీలోని లేడీ హార్డింగ్ మెడికల్ కాలేజీలో మూత్రపిండాల చికిత్స సేవల విస్తరణకు కూడా సహకరిస్తోంది. ఈ సందర్భంగా అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ చేసిన వ్యాఖ్యలను అధికారులు గుర్తుచేశారు. "ఒక వ్యక్తికి కంటిచూపును పునరుద్ధరించడం అంటే కేవలం వైద్యం అందించడం మాత్రమే కాదు, అతని జీవితంలో ఆశ, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని తిరిగి తీసుకురావడం కూడా" అని ఆయన పేర్కొన్నారు.

న్యూ టౌన్‌లో ప్రతిపాదిత ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే పశ్చిమ బెంగాల్‌తో పాటు తూర్పు భారతదేశంలోని రోగులకు అత్యాధునిక వైద్య సేవలు మరింత చేరువయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. పేదలకు ఉచిత వైద్యం, ఆధునిక చికిత్సలను ఒకే వేదికపై అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలవనుందని పేర్కొన్నారు.

# కాళేశ్వరం వద్ద బీఆర్ఎస్ ఆందోళన

- కన్నెపల్లి పంప్‌హౌస్‌కు కేటీఆర్ బృందం
- కంచెలు దాటి పంప్‌హౌస్‌కు చేరుకున్న నేతలు
- ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కేటీఆర్
- భారీ సంఖ్యలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

**జయశంకర్ భూపాలపల్లి, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ తన నిరసనను మరింత ఉధృతం చేసింది. ఆదివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు నేతృత్వంలోని పార్టీ బృందం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించింది. పోలీసులు ఏర్పాటు చేసిన కంచెలను దాటి పంప్‌హౌస్‌కు చేరుకున్న కేటీఆర్, అక్కడి పరిస్థితులను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతాంగానికి జీవనాడిగా నిలిచేలా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిందన్నారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. సాంకేతిక సమస్యలను సకాలంలో పరిష్కరించకుండా రైతులకు సాగునీరు అందించే అవకాశాలను దెబ్బతీస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును రాజకీయాలకు వేదికగా మార్చడం సరికాదని అన్నారు.

వృథాగా పోతున్న నీటి వద్దనే నిలబడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరిస్తున్నామని కేటీఆర్ పేర్కొన్నారు. కాళేశ్వరం బ్యారేజీలు, పంప్‌హౌస్‌ల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రైతుల ప్రయోజనాల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రజల సొమ్ముతో నిర్మించిన ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, దానిని విస్మరించడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనాచారి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్‌తో పాటు పలువురు మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యాయి.



పంప్‌హౌస్ పరిసరాల్లో భారీగా బీఆర్ఎస్ కార్యకర్తలు చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులో ఉంచేందుకు పోలీసులు విస్తృతంగా బందోబస్తు ఏర్పాటు చేశారు. నాయకుల పర్యటన ప్రశాంతంగా ముగిసేలా భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేటీఆర్ పర్యటనను పురస్కరించుకుని పార్టీ కార్యకర్తలు కాళేశ్వరం ప్రాజెక్టు పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని, దీనిపై తమ పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులు, నిర్వహణపై స్పష్టమైన కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ భారీ ప్రాజెక్టును సమర్థవంతంగా వినియోగించడమే రాష్ట్ర ప్రయోజనమని పేర్కొన్నారు.

# 14 అడుగుల అంబేద్కర్ కాంస్య విగ్రహం ఆవిష్కరణ

- మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమం
- సామాజిక, ఆర్థిక సమానత్వమే అంబేద్కర్ ఆశయమని డీకే శివకుమార్
- రాజ్యాంగ విలువలను ఆచరణలో పెట్టాలని పిలుపు

**బెంగళూరు, జులై 5 (తెలంగాణ ముచ్చట్లు):**

కర్ణాటకలోని బెంగళూరు రూరల్ జిల్లా పరిపాలన కార్యాలయ ప్రాంగణంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 14 అడుగుల ఎత్తైన కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా పాల్గొనగా, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కలలు కన్న సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని ప్రతి పౌరుడికి అందించడం ప్రభుత్వాలే కాకుండా సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు, న్యాయం, గౌరవం కల్పించడమే అంబేద్కర్ ఆశయమని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ చూపిన మార్గాన్ని ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

జిల్లా పరిపాలన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ భారీ కాంస్య విగ్రహం రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను నిరంతరం గుర్తు చేసే స్ఫూర్తి చిహ్నంగా నిలుస్తుందని డీకే శివకుమార్ తెలిపారు. సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ మూల సూత్రాలను భావితరాలు గుర్తుంచుకునేలా ఈ విగ్రహం ప్రేరణ కల్పిస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాదిగా నిలిచిందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, వాటిని పరిరక్షించడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు సమాజంలో సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధికి శాశ్వత మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.



ఈ కార్యక్రమంలో మంత్రులు కే.హెచ్. మునియప్ప, కే.జే. జార్జ్, ఎమ్మెల్యేలు శరత్ బచ్చేగౌడ, అనేకల్ శివన్న, ఎన్. శ్రీనివాస్, ధీరజ్ మునిరాజు, శ్రీనివాస్, ఎంపీ డాక్టర్ కె. సుధాకర్, ఎమ్మెల్సీ రవి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమం ముగింపులో రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సామాజిక సమానత్వ సాధనకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. అంబేద్కర్ ఆశయాలు యువతకు స్ఫూర్తిగా నిలవాలని, సమాజంలో ప్రతి వర్గానికీ సమాన అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాలు కట్టుబడి ఉండాలని వారు పేర్కొన్నారు. ఈ విగ్రహం బెంగళూరు రూరల్ జిల్లాకు ప్రత్యేక గుర్తింపుగా నిలవడంతో పాటు రాజ్యాంగంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచుతుందని అభిప్రాయపడ్డారు.





Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in